గుడిసె గుండెల్లో...

అది ఒక చెట్టు. ఎగిరే గువ్వకు నడిచే అవ్వకు తల్లి ఒడిలాంటి చెట్టు. ఆ చెట్టు ఉండేది ఒక బాట పక్కన. ఎప్పుడూ రాకపోకలతో రద్దీగా ఉండే ఆ బాట ఉండేది ఒక పట్టణంలో. ఆ పట్టణం ఉండేది ఆంధ్ర రాష్ట్రంలో ఆరాష్ట్రం ఉండేది ధర్మం నాలుగు పాదాలమీద నడుస్తున్న భారతదేశంలో. ఆ చెట్టు కింద కూర్చొని చెప్పులు కుట్టుకొంటున్న ముత్యాలు గుండె ముత్యాల పందిరే అయింది ఆ పాట వింటుంటే!

పాట మైమరపులో ముత్యాలు చేతిలో 'ఆరె' ఆగింది. ఉన్నట్లుండి ఏదో అడ్డుపడ్తే ఆగిన తెల్ల చీమల బారులా కుడుతున్న కుట్టు ఆగింది. అంత వరకు ఎడమచేతి వేళ్లలో కలగలిసి ఆడుకుంటూ ఉండిన తెల్లని నూలుదారం అలుపు తీర్చుకొంటూ ఉంది. అతడి అరికాలికింద చెప్పుమాత్రం కలిగినవాడి కాళ్లను అలంకరించాలని ఆత్రత పడుతున్నట్లుంది.

ముత్యాలు చూపు తనముందు గువ్వలావొదిగి కూర్చున్న బుల్లిరేడియో మీద నిలిచింది. రేడియోలో పాట శ్రావ్యంగా వినిపిస్తూ ఉంది.

గాలివానలకే తలలొగ్గేసి
ఉన్నవాళ్లకే చేతులొగ్గేసి
బడికీ వొడికీ ఒదగని కూనల
చలికొదిలేసీ కుమిలేవాడా!

తన బతుకును బాగా గమనించి చూసి ఎవరో ఆ పాట తనకోసరమే పాడుతున్నట్లు అనిపిస్తే ముత్యాలు భారంగా ఒక్క నిట్టూర్పు విడిచాడు.

చీమకున్న దొక పుట్టరా
చిన్న గువ్వకున్న దొక్క గూడు రా
తోడుండీ గూడేలేని నీ
గోడు తీరే మార్గమురా!

"నిజమే గనా! పొగులంతా యాడేడ తిరిగి తిందో ఏం పాడో చీమ. రేత్రయ్యే కుందికి పుట్ట చేరుకుంటింది. గువ్వగూడా అంతే కదా? రెక్క లల్లార్చుకుంటా కడుపాత్రం ఎట్టెట్ట ఎగిరినా, యాడేడ తిరిగినా పొద్దట్టా కుంకే కుందికి గూడు చేరు కుంటింది. కానీ నీ బతుకట్టా కాకపాయనే? పుట్టింది, పెరిగింది, బతికింది, బతకతా ఉండేది అంతా ఈ రోడ్ల మిందనే గదా? ఏమిజల్మాలో పాడు జల్మాలు. సిగ్గూ సెరము రొండూ లేని జల్మాలు. కడాన అడదాన్తో అచ్చటా ముచ్చటా తీర్చుకోవాలంటే గూడా ఈ రోడ్లే గెతి. చీచీ! ఈ కనాగష్టమైన బతుకులకంటే నోర్లేని జీవాలే మేలు!"

ముత్యాలు ఆలోచనలతో అవసరంలేకుండా రేడియోలో పాటకు పల్లవి పల్లవిస్తూ ఉంది. ఆపాట తనకు తెలియని గమ్యాన్ని తెలుపుతూ ఏదో హితబోధ చేసినట్లుంటే ముత్యాలు చూపును రేడియోపై నిలిపాడు. పాఠం చెప్తున్న అయ్యవారి ముందు విద్యార్థిలా పాటను చాలాశ్రద్ధగా వింటున్నాడు కదిలీమెదలకుండా!...ఆ చెట్టులో తానూ ఒక భాగమైనట్టుగా.

"ఏంది మావా? చేసే పని చెట్టుమిందికెక్కించేసి శానా శ్రద్ధగా ఇంటా ఉండావే? ఏం కత? రేపు ఎప్పుడన్నా రేడియోలో పాటేమన్నా పాడబోతావా?" ఎక్కడెక్కడో తిరిగి తిరిగి సందెడు బైరు ముక్కల్ని ఏరి తెచ్చి పక్కన కుప్పబోస్తూ అతడి పెండ్లాం ముత్తమ్మ అడిగింది కొంటెగా చూస్తూ!

"ఆ! పాడ్తా పాడ్తా! నువ్వు తీరుబాటుగా కూసోని..."

"ఎప్పుడు మానా అంత బాగ్గెం?"

"ఈజల్మంలో కాదులేయే పిచ్చిమొకమా! నువు ముందుగా ఆ పాట ఇనే."

ముందుచూపు కలిగి నువ్వా
మురికి గుంటే పూడ్చుకుంటే
ముచ్చటైన ముత్యాల పందిరై
ఒక చక్కని గుడిసె నీడవుతుంది.

చరణం పూర్తయింది. చరణం పూర్తి అవడంతో మళ్లీ పాటకు పల్లవి వినిపిస్తూ ఉంది.

"నిజమే గదంటె. చెప్పు, నువ్వే చెప్పు. చీమకు కూడా ఉండాదొక పుట్ట. చిన్న గువ్వకు ఉండాదొక గూడు. కడాన ఎలిక్కికూడా ఒక బొక్క ఉండాది గదే? మనకు ఏముండాది?"

"దేముడిచ్చిన చెట్టు నీడ!"

"రేపు దొరలొచ్చి లెయ్‌రా కొడకా అంటే?"

"ఇంకొక చెట్టు ఎదురు చూస్తా ఉంటిందిలే మామా!"

"ఈ చెట్టు కాకపోతే ఆచెట్టు. ఆచెట్టు కాకపోతే ఇంకొక చెట్టు. ఇట్లా ఎల్లకాలం

చెట్లకిందనే ఎందుకు బతకతారు? యాడైనా అంత మిట్టా గట్టూ చదరం చేసుకోని ఒక గుడిసె ఏసుకోమంటా ఉండారే!"

"ఎవురు మామా?"

"ఇయ్యరవదాకా రేడియోలో పాడిన పాట! చెవల్లో చెట్లేమన్నా మొల్సినాయా నీకు!"

"రేడియోలో పాడిన పాటనా? ఇంక అయినట్టే కాపరం...."

"అంటే?...రేడియోలో పాటంటే అంత అలుసైపొయ్యిందన్నమాట?"

"రామ!రామ! రేడియోలో మాటన్నా, పాటన్నా ఎగతాళిచేస్తే నా తల ఎయ్యి ముక్కలై పోదా? అయినా మాఁవా! నాకు తెలియకుండా అడగతా ఉండా, ఈ రేడియోలో చెప్పేదంతా జరగతా ఉండాదంటావా?"

"ఎందుకు జరగదే ఎర్రి మొకమా! జరక్కుండా పొయ్యేటట్లుగా ఉంటే ఎందుకు చెప్తారే?"

"మాఁవా! వాళ్లేందో మనకు వొరగబెట్టేసేటట్లు చెప్తానే ఉంటారు. మనం ఇంటానే ఉంటాం. ఇంటా ఊరికే ఉంటామా? కలలు కంటానే ఉంటాం. ఈ బతుకుల్లో కలలు ఎప్పుడైనా, యాడైనా నిజమవతాయా పాడా! అందుకే వాళ్లు అట్లానే ఉంటారు. మనం ఇట్లానే ఉంటాం."

"అయితే, ఇప్పుడేం చెయ్యాలంటావ్?"

"ఏమీ చెయ్యాల్సిన పని లేదు. పొగులు మాటలు పనికి చేటు. రేత్రి మాటలునిద్దర చేటని తెల్సుకోని మన పని మనం చేసుకోవాల."

ముత్తమ్మను చూస్తూ ముత్యాలు ముసిముసిగా నవ్వాడు.

"ఎందుకు మాఁవా నవ్వతాఉండావే?"

"నువ్వు నీతి బోదకాలు చేస్తా ఉంటే..."

"ఆ పని చేసేది నేను గాదు మాఁవా! అప్పుడప్పుడు మన తావుకొచ్చి చినిగిపొయ్న చెప్పులు కుట్టించుకుంటాడే పొడుగు పొడుగు నామాల అయ్యోరు, ఆయన కతలు చెప్పి కాసులియ్యకుండా పొయ్యేది. ఆయన ముందర నువ్వన్నా కూసో, లేకపోతే నీముంధర ఆయనన్నా కూసోబెట్టుకో."

ముత్యాలు నోరు మూత పడింది. బుల్లి రేడియో మీద నుంచి చూపు పనిమీదకు మళ్లింది. అలవాటు పడిన చేతులు. వాటి పని అవి చేసుకొంటున్నాయి. అయినా మనసు మాత్రం మనసులో లేదు.

"పరుల పంచలే తరిమికొడ్తే
పరిగెత్తి పోయే పిరికోడా!"

మాటిమాటికి ఎవరో ఎత్తిపాడుతున్నట్లుగా ఈ మాటలు చెవుల్ని తూట్లు పొడుస్తున్నాయి. ముత్యాలు ఆలోచనతో పోటీ పడ్తూ పని జోరుగా సాగుతూ ఉంది.

అప్పుడే పొద్దు వాటారింది. చీకటి పడకముందుగానే అంత ఉడకేసుకోవాలన్న ప్రయత్నంలో పడింది ముత్తమ్మ!

బుల్లి రేడియోలో పాటలు వినిపిస్తూనే ఉన్నాయి. అయితే, అవి సినిమాలో యుగళ గీతాలు. ముత్తమ్మ మూడు రాళ్ల పొయ్యి ముందు బొమ్మల్లే వొద్దిగ్గా కూర్చొని కట్టెలు ఎగదోస్తూ మైమరిచినట్లు ఆ పాటలు వింటూ ఉంది. ఆమె ఎండిన పెదవుల మీద తెలి నవ్వులు మిలమిల లాడుతున్నాయి. కానీ, ముత్యాలు చెవ్వుల్లో మాత్రం ఆపాటే! తనను ఒక పిరికివాణ్ణిగా చిత్రించిన పాటే!... తన అసమర్థత మీద దాడిచేసిన పాటే!... చెవ్వుల్లో గింగురుమంటూ ఉంది.

ఎవడో తన సంసారాన్ని పగబట్టి మేడలో నుంచి చెట్టు నీడకుగెంటేసినట్లు తెగ బాధపడిపోతున్నాడు. ఎంత ఆలోచించినా ఎవడా పని చేశాడో మనసుకు తట్టలేదు. తనకు తానుగా మాత్రం చెట్టు కిందికి రాలేదు. ఎవడూ రాడు కూడా. అయితే, అలా రావడానికి కారకుడెవడు?

ముత్యాలు గుండెలు కుతకుత ఉడుకు తున్నాయి!

కూటికుండలో ఎసరు సలసల కాగుతుంటే ముత్తమ్మ చేటలో ఏరిపిస్తూ ఉండిన బియ్యాన్ని ఎసట్లో వేసింది. కుండమీద మూత పెట్టింది. అయితే, మంటలేకనే కుతకుత ఉడుకుతున్న ముత్యాలు గుండెలపై మూత పెట్టలేకపోయింది.

ముత్యాలు చేతిలో 'ఆరె' కసక్ కసక్ మని చెప్పుల్లో దిగబడ్తూ ఉంది. తన బతుకును చెట్టు కిందికి నిర్దయగా నెట్టినవాడు కనిపిస్తే వాడి గుండెల్లోకి కూడా ఇలాగే దిగబడ్తా నన్నట్లుగా!

కాలం గంతులు వేస్తూ ఉంది తనకేమీ పట్టనట్లుగా.

ఆ బాటమీద కార్లు, మోటర్లు పరుగులు తీస్తున్నాయి. లారీలు వాటితో పోటీ పడుతున్నాయి. లాగలేక లాగుతుంటే లాగుడు బండ్లు, తొక్కలేక తొక్కుతుంటే రిక్షాలు కదులుతున్నాయి. అన్నీ కలసి ముత్యాలు మొగాన దోసెడు దుమ్ము కొట్టాయి. చెట్టుకింద కూర్చొని చెప్పులు కుట్టుకునే వెధవ ఇలా ఆలోచించకూడదన్నట్లుగా!

ముత్తమ్మ కూడు వండిన పొయ్యిమీదనే అంత కూర గూడా వండింది. కాళ్లూ చేతులూ కడుక్కొనింది. కూటికుండను, కూరచట్టిని చెట్టుబోదె చాటున మట్టసంగా పెట్టింది. ముత్యాలు కూడా పనిముట్లను తోలుసంచిలో భద్రపరిచాడు. రేడియోను ఆపుచేశాడు. రెండింటిని చెట్టుబోదె పక్కకు చేర్చాడు. అప్పుడు ఒళ్లు విరుచుకొంటూ ముత్తమ్మను ముద్దుగా చూశాడు.

ముత్తమ్మ కూడా ముసిముసిగా నవ్వుతూ -"మాఁవా! నువ్వేమీ అనుకోనంటే ఒక మాట అడగనా" అనింది.

ముత్తమ్మను వింతగా చూశాడు ముత్యాలు.

"ఏంది మావా! ఎప్పుడూ చూడనట్టు నువ్వట్టా కొత్తగా చూస్తా ఉండావే?"

"ఈ పొద్దు నువ్వు మరీ ఇంతగా అడగతా ఉంటే?"

"అదిగాదు మాఁవా! పొద్దుగూకులూ వంచిన తల అట్టా ఇట్టా ఎత్తకుండా రెక్కలు ముక్కలు చేసుకుంటావు గదా? అట్టా మాదిర చెమటోడ్చి సంపాయించిన దుడ్లు ఎత్తుకోని పొయ్ ఆడ చెల్లించకపోతే నిద్దర పట్టదా మాఁవా?"

"ఈ పొద్దుటి నుంచి ఇంక తాగబొయ్యేది లేదే?"

"సత్తింగానా మావా!"

"నీమిందొట్టే!"

సేద్యగాడికి కూడా ఒక మగబిడ్డనా అన్నట్లు చెట్టుకింద ముత్యాల్లో ఇంత చైతన్యం వస్తే సహించలేనట్లుగా కర్మసాక్షి కనుమరుగయ్యాడు!

పొద్దు గూట్లో కాదు కాదు ముత్తమ్మ కండ్లల్లో పడింది. ఆ కండ్లు మిలమిలా మెరిసి పోతున్నాయి. తాళిగట్టిన నాటినుంచి ఆరు నూరైనా మాట తప్పని తన మగవాడిమాటతో ఒళ్లు పులకరించింది. మామను ముద్దులతో ముంచెత్తాలని గుండె ఎగిరెగిరి పడింది. అయితే, ఉండేది చెట్టునీడలో అనుకునేకుందికి అడుగుముందుకు పడలేదు. అయినా, ముత్తమ్మ ముసిముసిగా నవ్వుకొనింది రేడియోలో విన్న పాటమనసులో మెదిలి! అవును గదా! అందాలమేడ కాకపోయినా ఇప్పుడు అడ్డంగా ఒక గుడిసె ఉండి ఉంటే? ముత్తమ్మ ఎండిన పెదాల మీద నవ్వులు వెండిపూత పూశాయి!

"ఏందే ఎఱ్ఱిమొకమా? నీకు నువ్వే అట్టా నవ్వుకుంటా ఉండావు. నవ్వు నవ్వు! నవ్విన నాపచేను ఇరగ పండిన నాటికి కదా నా మొగతనం తెల్సేది" అంటూ ముత్యాలు ముందుకు నడిచాడు.

"పొద్దు గూట్లో పడ్తానే అంత చుక్క నోట్లో పడకపోతే ఇలయిల్లాడి పోయే మణిసి ఇంతగా మాట్లాడతా ఉండాడే? ఈ పొద్దుటి నుంచి తాగనని నామింద వొట్టేసినాడే? అదే నిజమైతే ఇంకేం? ఇంకైనా పిలకాయలకు కడుపుచూసి అంత కూడు పెట్టొచ్చు" అని ఆలోచిస్తూ ముత్తమ్మ చెట్టుబోదెకు చేరగిలపడింది.

అంతవరకు ఆ చెట్టుకింద బొమ్మరిల్లు కట్టుకొని ఆడుకొంటూ ఉండిన పసిపాప ఉన్నట్టుండి ఆ బొమ్మరిల్లును తుడిపేసింది. ఒక్క లగువులో వచ్చి ముత్తమ్మ మీద వాలి పడింది. తల్లిగుండెల్లో తపన ఆ పసిగుడ్డు కేంతెల్సు? తనకు దొరికిన అవకాశాన్ని హాయిగా అనుభవిస్తూ ఉంది ఆ ఎదమీద!

ఆ అమ్మాయి కంటే పెద్దవాళ్లు ముగ్గురు కొడుకులు.

అందరి కంటే పెద్దవాడు బస్టాండులో, రైల్వేస్టేషన్‌లో 'బూట్‌పాలిష్ బూట్ పాలిష్' అంటూ కాలు ఒకచోట నిలవకుండా తిరుగుతూ ఉంటాడు-తమ బతుకు కొంతకు కొంత పాలిష్ అవుతుందన్న ఆశతో. రెండవవాడు మూటలు మోస్తున్నాడు తండ్రి మోస్తున్న మోత

ఎంతో కొంత తగ్గిద్దామన్న సదుద్దేశంతో. ఘుడవవాడు ఒక పెద్ద చెప్పుల ఫ్యాక్టరీలో పని నేర్చుకుంటున్నాడు కులవృత్తికి వారసుడు కావాలన్న పట్టుదలతో!

పొద్దు కుంకితే అందరికీ ఆ చెట్టు నీడే శరణ్యం.

ముత్యాలు ఎక్కడికి పోయాడో? ఎందుకుపోయాడో? ఎప్పుడు తిరిగి వస్తాడో ఏమో? అని ఆలోచిస్తూ ముత్తమ్మ కొడుకుల కోసం ఎదురు చూస్తూ ఉంది.

ఎవరికోసరం ఎదురు చూడకుండా కాలం గడచిపోతూనే ఉంది. ముత్తమ్మ ఎదమీద వాలిన పసికూన అలానే కిందకు జారి తల్లి తొడమీద తలవాల్చి ఎప్పుడో కన్నుమూసింది. అప్పుడు ముత్తమ్మ కొడుకులు ఒక్కొక్కరుగా చెట్టుకిందికి చేరారు. ఆ పూట తమ సంపాదన అమ్మ చేతుల్లో పెట్టారు. ఆప్యాయంగా ఆమె పెట్టింది తిన్నారు. ఆ తరువాత ముగ్గురూ మూడు దోవలయ్యారు. ఈ విశాల ప్రపంచంలో నడుంవాల్చడానికి జానెడు స్థలం దొరకకపోదులే అన్న ధైర్యంతో.

అంతవరకు పలచబడిన రోడ్డుమీద ఉన్నట్లుండి మనుషులు గుంపులు గుంపులుగా నడుస్తూ ఉంటే, "మొదటి ఆటకూడా ఇడ్సిపెట్టేసినారే. ఈ మొగోడు ఇంకా రాలేదే? యాడకి పొయ్‌నాడబ్బా?" అని ముత్తమ్మ వేదన పడ్తూ ఉంటే అప్పుడు ముత్యాలు కాళ్లీడ్చు కొంటూ చెట్టు కిందికి చేరాడు.

"ఇయ్యాలరవదాకా యాడికి పొయ్యుంటివి మాఁవా? సిల్మాకేమన్నా...."

"అఁ! మన బతుకులకు అదొగిటే తక్కవ" అంటూ నిట్టూరుస్తూ కూలబడ్డాడు ముత్యాలు.

"నిద్దర పడక లేచింది మొదలుకొని చూస్తా ఉండా. నీకత ఏందో నాకు అంతు చిక్కలా. నీ తలపాడు నీది కానీ...నువ్వు ముందంత ముద్ద తిను." ముద్దుముద్దుగా పలికింది ముత్తమ్మ.

ఆ మాటతో కూడా మారు పలక్కుండా పైకి లేచాడు ముత్యాలు. కాళ్లూ చేతులూ కడుక్కొని కూర్చున్నాడు. ముత్తమ్మ మూకుడు ముందు పెట్టింది. అన్నం వడ్డించింది. తవుడు బుట్టలో తలదూర్చిన గొడ్డులా తలెత్తకుండా తింటున్నాడు ముత్యాలు.

ముత్తమ్మకు ఏం మాట్లాడాలో పాలుపోలేదు. మాట్లాడకుండా ఉండడానికి వల్ల కాలేదు. అందుకే -

"పొద్దుగూట్లో పడేటప్పుడు ఎలబారిపోతివి. ఇయ్యాలరవదాకా..."

"ఈ పొద్దుటితో ఈచెట్టుకు, మనకు రుణం తీరి పొయ్యిందే!"

"నువ్వు మాట్లాడేమాట ఏమన్నా బాగుండాదంటావా మాఁవా?"

"బాగాలేదు కాబట్టే కదా ఈ పని చేస్తా ఉండేది."

"నువ్వు చెప్పేది బలే బాగుండాదే కత. ఇన్నాళ్లు బాగుండింది. ఇప్పుడెట్లా బాగలేకుండా పోతింది."

"నన్నేమన్నా అంత తిననిస్తావా? లేకపోతే ఈ దెప్పళ్లే తినమంటావా?"

ఆ మాటతో ముత్తమ్మ మూతి ముడుచుకొని కూర్చొనింది. ముత్యాలువంచిన తల ఎత్తకుండా నాలుగు మెతుకులు నోట్లోవేసుకొన్నాడు. చేతులు కడుక్కొన్నాడు. మూతి తుడుచుకొంటూ వెళ్లి చినిగిన సంచిపట్ట మీద చిన్నారి కూతురి పక్కన కూర్చున్నాడు. భవిష్యత్తు ఆశాజనకంగా కనిపిస్తూ ఉంటే వెల్లకిల పడుకొని ఆలోచిస్తూ పైకి చూస్తున్నాడు. చూస్తుంటే ఇన్నాళ్లుగా తమకు నీడనిచ్చిన చెట్టు కనిపిస్తూ ఉంది. మనసు బాధగా మూలిగింది. ఆ చెట్టు కొమ్మ సందుల్లోనుంచి చూస్తుంటే ఆకాశం విశాలంగా కనిపిస్తూ ఉంది. ఆకాశంలో చుక్కలు తన ఆశలకు అద్దం పట్టినట్లుగా మినుక్ మినుక్ మంటున్నాయి.

తృప్తిగా గుండెలనిండుకు గాలి పీల్చుకొన్నాడు ముత్యాలు. ముత్తమ్మ అంత ఎంగిలి పడింది. కుండా చట్టి కడిగి చెట్టుబోదె మాటులో ఒకదానిపై ఒకటి బోర్లించి పెట్టింది. ఆ తర్వాత వచ్చి మగని పక్కన కూర్చొనింది.

"మాఁవా! నా కడుపులో ఏందో చెయ్యేసి దేవినట్లుండాదే!"

"ఎందుకే?"

"రొండోవాడు కడుపులో పణ్ణెప్పుడు గద మావా మనమీ చెట్టు కిందికొచ్చింది. లచ్చణంగా నలుగురు పిలకాయలైనారు. చన్నీళ్లకు ఏన్నీళ్లుగా వాళ్లూ గూడా అంతో ఇంతో సంపాయిస్తా ఉండారు. కలిసొచ్చిన చోటు గదా? కాలు ఎలపెరుక్కోని పోవాలంటే నాకేమో అదొక మాదిరిగా ఉండాది మాఁవా!"

"ఒసే పిచ్చిదానా? ఇయ్యురవదాకా ఊరంతా తిరిగింది ఎందుకని?"

"నాకెట్టా తెలిస్తింది మాఁవా?"

"ఇంతకంటే మంచి చోటే ఎతికి పట్నానే?"

"యాడ మాఁవా?"

"బస్టాండు పక్కపక్కన్నే. ఇదే మాదిరి చెట్టు. చెట్టుకు ఎదురుగుండా సిల్మా కొటాయి. ఈపక్కా ఆపక్కా సొలుపుగా ఓటళ్లు. ఇరవై నాలుగు గెంటలూ ఇసికేస్తే రాలని జనం..."

"ఈడ మాత్రం మనకేం తక్కవయింది మావా?"

"తక్కవని కాదే తిక్కమొకమా? చెట్టు పక్కనే బీడు. మోకాటి లోతు గుంటలూ, మిట్టలు. ఆ గుంతల నిండుకు జలదారి నీళ్లు. ఆనీళ్లల్లో పందులు పొల్లాడ్తా ఉండాయి. దాన్ని అట్టా చదరం చేసుకోని ఒక చుట్టుగుడిసె ఏసుకుంటే?..."

"ఆశకు కూడా ఒక మితం ఉండాల. అది అయ్యే పనేనంటావా?"

"ఆదిలోనే అపశకునం కూతలూ....ఈ కుండగోకుళ్లూ..."

"పీకినా గోకినా నీ మేలు గోరే కద మాఁవా? ఏపూట కాపూట జానెడు పొట్ట

పూడ్సుకుండేదే గగనమైపోతా ఉంటే మోకాటి లోతు గుంతలు పూడ్సేసి నడుమెత్తు గోడలు పెట్టుకుండేదంటే మాట్లా మాఁవా?"

"నిజమే! నీమాట నేను కాదనలా. అయినా దినదినానికి ఊరెంతగా మారిపోతా ఉండాదో చూస్తానే ఉండావు గదా? ఊరు మారిపోతా ఉణ్ణెట్టు మణుసుల బుద్దులు గూడా దినదినానికి మారిపోతా ఉండాయి. యాడ జూసినా పాత మిద్దెల్ని పగలగొట్టి కొత్త మిద్దెలు కట్టుకుంటా ఉండారు. అట్టా మాదిర పగలగొట్టి ఈదుల్లో కుప్ప బోసిన రాళ్లూ రప్పల్ని, మట్టిని బండ్లు పెట్టి ఊరవతలకు తోలిస్తా ఉండారు. బండికి ఇరవై, ముప్పై రూపాయలు కూలీ. నీ ముగ్గురు కొడుకులూ మూడు తట్టలూ నువ్వూ నేను చెరొక తట్ట చేతికెత్తుకుంటే ఎంతసేపే? కూలికి కూలీ గిట్టుతుంది. గుంతలూ పూడ్తాయి."

ముత్తమ్మ నోరు కుట్టేసినట్లు మౌనంగా వింటూ ఉంది.

"ఎట్టుండాదే మన ఐడియా?"

"ఇనేదానికేం బెమ్మాండంగా ఉండాది."

"అంటే? చెయ్యాలగద అంటావా?సరే! చూస్తానే ఉండు. దినానికి ఎట్టలేదన్నా పదిరూపాయలకు తక్కవగాకుండా తాగతా ఉంటినా? ఇప్పుడు నిలవేసినానా? ఆ లెక్కన నెలకెంత మిగులుతుంది? మున్నూరు రూపాయలు. ఒకపూట తిని ఒకపూట తినకుండా ఓపిక పట్టే నాలుగు కూసాలు, పది వాసాలు, అంత బోదకసువు! గుడిసె లెయ్‌మంటే పైకి లెయ్‌దా?"

"ఎందుకు లెయ్‌దు మాఁవా? బెమ్మాండంగా లేస్తింది. అయితే చెప్పినట్టు చెయ్యాలగదా?"

ఆ మాటతో ముత్యాలుకు ఎక్కడలేని రోషం పుట్టుకొచ్చింది.

"పెనుమూరు ముత్యాలమ్మ సాచ్చిగా, చంద్రగిరి మూలస్తానమ్మ సాచ్చిగా, ఆ కొండ మిందుండే ఏడుకొండలోడి సాచ్చిగా, నీ సాచ్చిగా నెల తిరిగే లోపల గుడిసె కడగాలు లెయ్యకపోతే..."

ఒక పుల్లతో నేలమీద పిచ్చిగీతలు గీస్తూ మామ చెప్పే మాటలు ఆలకిస్తూ ఉన్న ముత్తమ్మ చివుక్కున తలపైకెత్తింది. ఆ నోటినుండి మాట ఎంత దురుసుగా వస్తుందో తనకు తెలుసు. అందుకే గబుక్కున అరచేత్తో అతడి నోరు మూసింది.

ముత్యాలు ఆప్యాయంగా ఆమె నడుంపై చెయ్యివేశాడు. అలాగే పక్కలోకి లాక్కొన్నాడు.

ఆ రోజు తెల్లారింది.! ఆ చెట్టుకింద కాదు. బస్టాండ్ పక్కన చెట్టుకింద!

❊ ❊ ❊ ❊

తూర్పున పటం ఎగిరింది.

తొలి వెలుగు రేఖలు ఊరిమీద పరుగులు తీస్తున్నాయి. చీకటి ఒడిలో నిశ్చలంగా

తలదాచుకున్న ఊళ్లో చలనం ఊపు అందుకొనింది. కడుపాత్రం తాపత్రయంగా మారింది. వీధుల్లో కదలిక.... బస్‌స్టాండులో కదలిక.... చెట్లమీద కదలిక - ఉదయం ఒయ్యారంగా సింగారించుకొని కదలినట్లుంది.

ముత్తమ్మ కోడికూతతో నిద్రలేచించి. దీగూట్లో బుడిగలోనూనె అంతఅరచేతిలో వేసుకొనింది. ఉచ్చి మీద తడుముకొన్నట్లు రుద్దుకొనింది. మూడు ముంతలనీళ్లు నెత్తిన కుమ్మరించుకొనింది. అక్కడక్కడా చిమటలుకొట్టి పాతదై పోయినా పెండ్లికి కొనుక్కొన్న నారపట్టు చీరనే కట్టుకొనింది. తడి ఆరని తలనుండి నీళ్లు బొట్లు బొట్లుగా పడుతున్నాయి. ముత్యాలు కండ్లనుంచి రాలుతున్న ఆనందబాష్పాల్లా! ఆదరా బారదా గుడిసింటిని అలికింది. ముగ్గులు పెట్టింది. ఆ ముందురోజు సాయంత్రం ముత్యాలు తెచ్చిన వెంకటేశ్వరుడిపటాన్ని నట్టింటపెట్టింది. పూలుపెట్టింది. దీపంవెలిగించింది. అయ్యావారు పెట్టిన లగ్నానికి సరిగ్గా పాలు పొంగించడానికి పొయ్యి రగిలిస్తూ ఉంది-ముత్యాలు హడావిడి పడ్తుంటే!

బస్టాండ్‌లో టవర్‌క్లాక్ ఆరుగంటలు కొట్టింది. అందుకోసరమే ఎదురు చూస్తున్న ముత్యాలు వెంకటేశ్వరుడి పటంముందు 'టప్' మని టెంకాయ కొట్టాడు. కర్పూరం వెలిగించి హారతి పడుతుంటే, ముత్తమ్మ బిడ్డలతో కలిసి పడిపడీ మొక్కింది.

పొయ్యిమీద పెట్టిన పాలు పొంగి 'చుఁయ్' మన్న శబ్దం వినిపించింది.

ఆ గుడిసె గుండెల్లో ఆనందం పొంగి పొరలింది!

చుట్టుగుడిసె. ఆ గుడిసె ముందర పందిరి. ఆ పక్కన్నే నాలుగు తడికలు అడ్డంగా ఒక పెరడు- ఇంటిల్లి పాది రెండు నెలలు రాత్రనక పగలనక పడిన కష్టానికి ఫలితం-ప్రపంచాన్నే తొలిసారిగా చూస్తున్న అనుభూతి!

వాళ్ల ఆనందంలోవాళ్లుంటే మునిసిపాలిటీ సైరన్ చెవులు చిల్లులు పడేటట్లు కూతేసింది. "అయ్యో అప్పుడే ఎనిమిదై పొయ్యిందే గెంట" అని ఆత్రతపడ్తూ ముత్యాలు ముగ్గురు కొడుకులు ఎవరి పనులకు వాళ్లు బయలుదేరారు. వాళ్లతో కలిసి ముత్యాలు...

"ఈపొద్దు ఒకపూట ఇంట్లోనే ఉండిపోరాదా మాఁవా?"

మొగాన్ని చింకిచేటంత చేసుకొని అడగలేక అడిగింది ముత్తమ్మ. ముత్యాలు ముసి ముసిగా నవ్వాడు.

"ఎందుకు మాఁవా ఆ నవ్వు?"

"పొగులు మాట్లు పనికి చేటు, రేత్రి మాట్లు నిద్రపన్నేటు- అని చెప్పింది నువ్వా నేనా?"

ముత్తమ్మ మూడు వంకర్లు తిప్పింది మూతిని!

'రేత్రికి ఎట్టా నిద్దర పన్నేటు తప్పదు గదా...మల్లా ఇప్పుడెందుకులే"అంటూ కొంటెగా చూస్తూ ముత్యాలు చెట్టు కిందికి హుషారుగా చేరుకొన్నాడు. ముత్తమ్మ గుండె

తేనెపట్టేఅయింది.

ముత్యాలు చెట్టు కింద మట్టసంగా కూర్చున్నాడు. తోలు సంచి విప్పాడు. పనిముట్లు సర్దుతున్నాడు. అనుకొన్నది సాధించిన ఆనందంతో అతని గుండె గూడు విడిచిన గువ్వే అయింది! ఉన్నట్లుండి తల పైకిలేచింది.

చూపు గుడిసె మీద పడింది. రెప్పార్చకుండా గుడిసెను చూస్తూ గుండెల నిండుకు గాలి పీల్చుకున్నాడు. చిరునవ్వు పెదవుల మీద చిందులేస్తూ ఉంది. 'ఇట్లానే ఒళ్లొంచి పని చేసుకుంటే గుడిసె మిద్దెగా మారేదెంతసేపు' అని అనుకొంటాడు. అంతలోనే చేతిలో పని చెవిపట్టి లాగుతుంది. తలవాలిపోతుంది. ఎడమచేతి వేళ్ల సందున దారం, కుడిచేతిలో 'అరె' పంతాలు పడుతుంటే ముత్యాల సోలుపులా కుట్టు ముందుకు సాగిపోతూ ఉంటుంది. ఆ దినం ముత్యాలకు క్షణం ఒక యుగంలా గడుస్తూ ఉంది. ఎప్పుడు పొద్దు గూట్లో పడుతుందా? ఎప్పుడెప్పుడు వెళ్లి గుడిసెలో పడ్తామా? అన్న ఆత్రత!

తలదాచుకోవడానికి ఒక గుడిసె కట్టుకొన్నామన్న తృప్తి. ఇంకా ఒళ్లొంచి కష్టపడ్తే గుడిసెను మిద్దెగా మార్చుకోవచ్చు అన్న ఆలోచన. మనసు పూర్తిగా పని మీద లగ్నమైతే పొద్దు గడిచినట్లే తెలియలేదు.

పొద్దు గూట్లో పడింది.

ముత్యాలు గబగబ మూటాముల్లె సర్దుకొన్నాడు. పనిముట్లను తీసి తోలుసంచిలో భద్రపరచుకొన్నాడు. చేతిలో మూట, సంకలో సంచితో పైకి లేచాడు. ఒక్క క్షణం చూపులు గుడిసె మీద నిలిచాయి. శుక్లపక్షం. త్రయోదశి నాటి వెన్నెల. ముత్యాలు గుండెల్లోని ఆనందాన్నే నేలమీది నుండి నింగికి వెదచల్లినట్లుంది. ఆ వెలుగువాగులో తన చుట్టు గుడిసె పూల తెప్పలా తేలుతున్నట్లనిపించింది. తనకుతెలియకనే కాళ్లు గుడిసె వైపు తేలిపోతున్నాయి. గుడిసె దాపుకు చేరుకొనేటప్పటికి ముత్తమ్మ ముసిముసిగా నవ్వుతూ ఎదురొచ్చింది. ఒక చేత్తో చేతిలో మూటను, ఇంకొక చేత్తో చంకలో సంచిని అందుకొనింది. ఇద్దరూ గుడిసెలోకి నడిచారు జంట గువ్వల్లా!

ఆపూట ముత్తమ్మ ముగ్గురు కొడుకులకు మూడు వేళలా రెండు కూరలతో కడుపులు చూసి తృప్తిగా కూడు పెట్టింది. తలా రెండు రూపాయలు ఆనందంగా చేతిలో పెట్టి 'సిల్మాకుపొండిరా!' అనింది. వాళ్లు పలుపులు విప్పిన దూడలే అయ్యారు. అప్పటికే ముద్దుల కూతురు ఎప్పుడూ లేని గోరుముద్దల రుచిని అనుభవించి హాయిగా నిద్రపోతూ ఉంది.

అప్పుడు ముత్తమ్మ, ముత్యాలు ఒకరికి ఎదురుగా ఒకరు కూర్చున్నారు. ఒక మూకుడులోనే కూడు నంజి నంజి తింటూ ఒకరికొకరు తినిపించుకొంటూ మధ్యమధ్య ముసిముసి నవ్వులు నంజుకొంటూ కొత్త దంపతులను మరిపించారు. గుడిసె వాకిలికి తడికె తలుపు అడ్డంగా పెట్టారు. ఆ ముందురోజు కొని తెచ్చుకొన్న కొత్త చాప

పరుచుకొన్నారు. పడుకొన్నారు. ఏచెట్టుకిందనో అటొకరు, ఇటొకరుగా పడుకొనేవాళ్లు..... ఇన్నాళ్లకు, ఇన్నేండ్లకు ఒకరి పక్కన ఒకరుగా, ఒకరి చేతుల్లో ఇంకొకరుగా ఇద్దరి మధ్య గాలి దూరనంతగా గాఢంగా!...ఆ రాత్రి ఆ గుడిసెలో ఆనందం అణువణువునా విస్తరించింది. ఆరోజు కూడా తెల్లారింది!

అయితే, చాలాకాలంగా జబ్బు వాతపడి నాలుగు గోడల మధ్య నలిగిన మనిషి ఉన్నట్లుండి వెలుతురును చూసినట్లు,ఆ దంపతుల ఆనందం గుడిసింటి ముంగిట ముత్యాల ముగ్గులు పోసింది.

❋ ❋ ❋ ❋

ముత్యాలు చెట్టు కింద కూర్చున్నాడు. భావస్ఫోరకంగా కుదిరిన కవితను కవి మాటిమాటికి చదువుకొన్నట్లు, చూడ ముచ్చటగా చిత్రించిన చిత్రాన్ని చిత్రకారుడు తనివి తీరా చూసినట్లు- ముత్యాలు ఒక్కసారి గుడిసెను చూశాడు. స్పష్టమైన చిరునవ్వు పెదాలమీద చలిస్తూ ఉంటే ఆ కండ్లతోనే బుల్లి రేడియోను చూశాడు. రెండు చేతులతో జవురుకొని ముద్దు పెట్టుకున్నాడు. తనకు ప్రేరణ ఇచ్చినందుకు కృతజ్ఞతగా ముందు పెట్టుకొన్నాడు. మనసులో ఏదో అమాయకమైన విజయానందం. అంతరంగం మేలుకొనింది. పట్టుదల పెరిగింది. పనిజోరు హెచ్చింది.

ముత్తమ్మ గుడిసెలో అప్పుడే ఇంట్లో అడుగుపెట్టిన కొత్త కోడల్లా అటూ ఇటూ తిరుగుతూ సర్ది పెట్టిన మూకుడు ముంతనే మళ్లీ మళ్లీ సర్ది పెడ్తూ ఉంది.

కాలచక్ర గమనంలో సూర్యకిరణాలు చురుక్కు చురుక్కు మంటున్న వేళ!

"ఎవర్రా లోపల?"

ఆ గద్దింపుతో అదిరిపడింది ముత్తమ్మ. చేతిలో ముంత జారి కింద పడింది. మూడు వొప్పలయింది. అదేమీ పట్టించుకోకుండా గబగబ గుడిసె బయటికి వచ్చింది. వచ్చింది వచ్చినట్లే కదిలీ మెదలకుండా నిలబడింది, కంటిమీద రెప్పపడకుండా చూస్తూ!

ఎదురుగా పోలీస్ ఇన్ స్పెక్టర్ నలుగురు పోలీసులతో. రోడ్డు మీద పోలీస్ వ్యాన్.

ముత్తమ్మకు అంతా అయోమయంగా ఉంది. ఒకసారి ఇన్‌స్పెక్టర్ని, ఇంకొకసారి పోలీసుల్ని, మరొకసారి పోలీస్ వ్యాన్‌ను మార్చి మార్చి చూస్తుంటే-

"ఏందే అలా చూస్తున్నావ్? ఎక్కడ నీ మొగుడు?" డీజల్ ఇంజన్ కూతలాగా గీ పెట్టింది ఇన్ స్పెక్టర్ గొంతు.

ముత్తమ్మ గుండెలు దడదడ అదిరాయి. ఆ అరుపుతో పూరి గుడిసె కప్పు పైకెగిరి పోతిందేమో అనిపించింది. ఆమె పిచ్చిచూపుల్తో కలవడానికి కన్నీళ్లు తొందరపడ్తున్నాయి!

"ఏమిటా చూపులు? అడిగేది నిన్నేనే?" రెక్కమాని ముందు ఆగిన రైలుకూతలా రెట్టించిందా గొంతు.

నాలుక తడి ఆరింది. పెదాలు ఎండి పోతున్నాయి. ఎంత ప్రయత్నించినా మాట

పెగలడంలేదు. ఎండిపోతున్న పెదాల్ని తడుపుకోడానికి తంటాలు పడ్తూ, మాటిమాటికి చెట్టువైపు చూస్తూ చెట్టుకింద...చెప్పులు కుట్టుకుంటా...చెప్పలేక చెప్పింది మాటల్ని తుంచి తుంచీ ముత్తమ్మ!

"పిలువ్ వాణ్ణిలా!"

పిలుపు అవసరం లేకనే ముత్యాలు అక్కడికి పరుగుల మీద వచ్చాడు, గుడిసె ముందు పోలీసు అవతారాలు కనపడేసరికి.

"ఏరా? ఎవఁడ్రా నిన్నిక్కడ గుడిసె వేసుకోమనింది?"

"రేడియో వాళ్లయ్యా!"

ఆ మాటతో విరగబడి నవ్వాడు ఇన్‌స్పెక్టర్.

అతడు ఎందుకలా నవ్వుతున్నాడో అర్థం కాకుండా ముత్యాలు, ముత్తమ్మ అయోమయంగా ఒకరి మొగం ఒకరు చూసుకొంటున్నారు.

"ఆకాశవాణి అనుమతించిందనలేదు, అంతవరకు నయమే!"

ఆ వ్యంగ్యాన్ని అర్థం చేసుకొనే స్థితిలో లేడు ముత్యాలు. పోలీసులు మాత్రం ముసి ముసిగా నవ్వుకొన్నారు, ఇన్‌స్పెక్టర్‌గారి చమత్కారాన్ని అభినందిస్తున్నట్లుగా.

"గంట టైమిస్తున్నా. కుండా చట్టీ చేతబట్టుకొని కుదురుగా బైటపడు. లేకుంటే మా వాళ్లే ఆపని చేస్తారు."

పోలీసు దర్పం బుసలు కొట్టిందా మాటల్లో.

"అయ్యా!అయ్యా! పందులు పొల్లాడ్తా ఉణ్ణె బురదగుంట....రేత్రనక, పొగులనక ఒక్క దినమా? రొండు దినాలా? రొండు నెలల పొడగనా నేను, మా ఆడది, ముగ్గురు బిడ్డలు -కడుపు గట్టి, కన్నగసాట్లు పడి, ఏసుకున్న గుడిసె..." ముదురు మొగంలో అలిసిన కండ్లల్లో కన్నీటి బొట్లుగా రాలాయి మాటలు.

"మాతో చ్యెకొని ఏం ప్రయోజనంరా! వెళ్లి ఆ రేడియో వాళ్లతో చెప్పుకో. వినక పోతే నష్టపరిహారానికి కోర్టుకు కూడా పోవచ్చు!"

ఎంత ఎకసక్కెమో ఆమాటల్లో?

ఎగ్గొట్టుకొస్తున్న ఏడుపును దిగమింగుకొంటూ ముత్తమ్మ తట్టా బుట్టా బయటికి తెచ్చి పెడ్తూంటే-

"నీ కెందుకే అంత తొందర నీయమ్మా నాయాలి ముండా" అంటూ ముత్తమ్మ చేతిలో కుండను ఒక్క ఊపులో పెరుక్కున్నాడు. అంతే! బూటుకాలు ముత్యాలు వీపు మీద విరుచుకుపడింది. ఆ తన్నుతో 'అమ్మా' అంటూ బోర్లబొక్కల పడ్డాడు ముత్యాలు. చేతిలో కుండ వొప్పులొప్పులైంది.

ఇంకొకడి చేతిలో లాఠీ కఱ్ఱ పైకిలేచింది.

ముత్తమ్మ అడ్డుపడింది.

"అయ్యా!అయ్యా! ఆయన్ను ఏమీ అనకండయ్యా! నేను ఎప్పుడో నెత్తిన నోరు పెట్టుకొని మొత్తుకుంటి, ఎవురు యాడ ఉండాల్నో ఆణ్ణే ఉండాలని. చెప్తే చెవుల్లో ఏసుకోక పాయ. అది ఆడదో, గాడిదో చెప్పినమాట ఇనిపించుకోక పొయ్యిందానికి ఇప్పుడు అనబవించాల్సి వచ్చె. అయినా, మాబోటి పేదోళ్లు ఏం చెయ్యగలగతారయ్యా? కొడ్తే ఏడ్చేది తప్పిస్తే! ఈ ఇంద్రబవనాన్ని కాళీ చేసేదానికి గెంట ఎందుకులేయ్యా" అంటూ ముత్తమ్మ మాటల్ని కన్నీళ్లతో కలగలిపింది.

అర్ధగంట లోపుగానే చెట్టుకింది బతుకులు చెట్టుకిందికే చేరాయి.

అర్ధగంటకు ముందు ఆ గుడిసె ముందు ఆగినపోలీస్ వ్యాన్‌లో నుంచి పోలీసులు దిగారు. పోలీస్ వ్యాన్ అలా వెళ్లేసరికి ఇలా వచ్చి ఆగిన వ్యాన్‌లో నుంచి ప్లాస్టిక్ టిన్నులు, పీపాలు దిగాయి. ఒక పక్క టిన్నులు, పీపాలు దిగుతూ ఉంటే, ఇంకొక పక్క సేల్స్ కౌంటర్ తయారయింది. సాయంకాలంలోగానే లగ్నాలు, పూజలతో నిమిత్తం లేకుండా ఆ గుడిసెకు ఎదురుగా, బాటకు పక్కగా 'ప్రభుత్వ సారా దుకాణం' అన్న బోర్డు వెలిసింది.

ముత్తమ్మ, ముత్యాలు చెట్టుకింద చేతులు ముడుచుకొని కూర్చొని ఆ గుడిసెను చూసినంత సేపు చూశారు నిస్సహాయంగా. పేగు తెంచుకొని బయటపడ్డ పిండం మరలా తల్లి గర్భం చేరలేనట్లు వాళ్లు మళ్ళీ ఆ గుడిసెలోకి పోలేరని తెలుసు. అయినా, తొట్టి మరులు వదలలేదు. రెప్పార్చకుండా ఆ గుడిసెను చూస్తుంటే గుండెల్ని రెక్కలు పురుగులు తొలుస్తున్నట్లు బాధ. తట్టుకోలేకుండా ముత్యాలు తల వాలిపోయింది మోకాళ్ల సందుల్లోకి. మూగగా రోదిస్తున్నాడు. చెట్టుబోదెకు చేరగిలబడి ముత్తమ్మ అశోకవనంలో సీతమ్మను తలపింపచేస్తూ ఉంది. వాళ్ల బాధను చూడలేనట్లుగా కర్మసాక్షి కనుమరుగయ్యాడు.

కృష్ణపక్షం. చీకటి తన యాత్రకని బయలుదేరింది. గంటగడవక ముందే తిరుగు ముఖం పట్టింది. విదియ చంద్రుడు అడ్డుపడడంతో వెలుగు వెన్నెల పాలనురుగులా లోకమంతా విస్తరించింది. ముత్యాలు ఉన్నట్లుండి తల పైకి లేశాడు. గుడిసె తట్టు చూశాడు. శుక్లపక్షంలో త్రయోదశి నాటి వెన్నెల్లో పూల తెప్పలా కనిపించిన తన గుడిసె ఇప్పుడు తల విరబోసుకొన్న దయ్యంలా కనిపిస్తూ ఉంది. ఒక్క ఊపులో పైకి లేచాడు. కండ్లు చింతనిప్పుల్లా మండుతున్నాయి. అటూ, ఇటూ చూశాడు. లోకం తనపని తనదిగా సాగిపోతూ ఉంది. చెట్టుకిందికి చూశాడు. ఏడ్చిఏడ్చి నీరసించి ఇక ఏడవడానికి కూడా ఓపికలేక ముత్తమ్మ చెట్టుబోదెకు చేరగిలపడింది. చిన్నది తల్లి గుండెలమీద బల్లిలా హత్తుకొని నిద్రపోతూ ఉంది. కొడుకులు ఇంకా చెట్టుకిందికి చేరలేదు. ముత్యాలు గబామని వంగి సంచిలో మూటకట్టి పెట్టిన దుడ్లు తీసుకొన్నాడు. ఒక్క ఊపులో గుడిసె ముందుకు చేరుకొన్నాడు.

మూట విప్పాడు. దుడ్లు ఇచ్చాడు. ఒకటి, రెండు, మూడు పొట్లం మీద పొట్లం గుటగుటా తాగేశాడు. అప్పుడు గుడిసె కాదు, గుడిసెలో మనుషులు వాణ్ణి గుర్తించారు.

ఒకరి మొగం ఒకరు చూసుకొన్నారు. చూపులు కలిశాయి. తలలు పంకించాయి. ప్రతిబంధకాన్ని తొలగించుకోవడమే మంచిదన్న ఆలోచన కార్యరూపంలోకి దిగింది. పొట్లం మారింది. అది కల్తీ సారా! ముత్యాలు గమనించే స్థితిలో లేడు. చేతిలో దుడ్లున్నంత వరకు తప్ప తాగాడు. గిరక్కు వెనక్కున తిరిగాడు. తూలుతూ పడుతూ లేస్తూ నడుస్తున్నాడు.

ఆ స్థితిలో ముత్యాలుకు బూటుకాలుతో తన్నిన పోలీసు గుర్తుకొచ్చాడు. లాఠీ కర్ర పైకెత్తిన పోలీసు కనిపిస్తున్నాడు. కల్తీ సారా కడుపులో రేపిన మంట గుండెల్లోకి పాకింది.

"ఒరే పోలీసోడా! నేను దిక్కూదరీ లేని యదవనే అనుకో. నన్ను కొట్టేదానికి లాఠీ కట్టె పైకెత్తితివే? ఆ కట్టె నువ్వు అహ! ఎట్టా పట్టుకుంటా ఉండావో తెల్సా నీకు? ఒకసారి చూసుకోరా! హ్హహ్హహ్హ!" నవ్వినంత సేపు నవ్వాడు ముత్యాలు. నవ్వు ఏడుపుగా మారింది.

"ఒరే!ఎగిరి ఎడం కాల్తో తంతివే? ఆ నీకాలికి బూడ్సులు కుట్టింది ఎవుర్రా?...నేను నీ కాలికి ఏమాత్రం దెప్పరం తగలకుండా నీడిస్తే - నువ్వు నా తలకాయ మింద నీడ పెరుక్కుంటావా? మీకంటే గొడ్లు మేల్రా. చచ్చినా గూడా మా చేతికి పని, మీకాళ్ల కిందకి చెప్పులిస్తా ఉండాయి. ఆ నోర్లేని గొడ్లు అవసరం ఉంటేనే అపకారం చేస్తాయి. మీరట్లా కాదు గదరా? కలిగినోళ్ల కాళ్లు పట్టుకుంటారు. లేనోళ్ల జుట్లు వడేసి పట్టుకుంటారు. అవును గదా? కొట్టినా, కోసినా మాకెవరుండారని గదా మీ దిమాకు?"అని ఏడుస్తూ బోర్ల బొక్కలా పడ్డాడు ముత్యాలు.

లేచేదానికి ప్రయత్నిస్తాడు. లేవలేడు. లేవలేక ఏడుస్తాడు. ఏడుస్తూ లేచేదానికి ప్రయత్నిస్తాడు. లేస్తూ పడిపోతాడు. పడిపోతూ ఏడుస్తాడు. ఆ స్థితిలో పొడుగు పొడుగు నామాల అయ్యోరు గుర్తుకొచ్చాడు.

ముత్యాలు ఒక్క ముంపులో పైకి లేచాడు. అయ్యావారి రెండు భుజాలు వొడిసి పట్టుకొన్నట్లుగా పిడికిళ్లు బిగించి-

"చెప్పు అయ్యోరా చెప్పు. నీ పాత చెప్పులు కుట్టిస్తా పైసా తీసుకుంటినా? లేదే? మరి నువ్వు పెట్టిన లగ్గణం ఏమాయె? సరిగ్గా నువ్వు పెట్టిన లగ్గణానికే గుడిసెలో పాలు పొంగిస్తినే? అదేం లగ్గణం అయ్యోరా? దినం మారకనే దానికీ నాకు రుణం తీరిపాయనే? నువ్వుకూడా నాకు ఇట్టామాదిర అన్నాయం తలపెట్టచ్చునా? పోనీ, నువ్వు చెప్పిన కతలన్నీ ఏమాయ? కతలు కంచికి నేను చెట్టుకిందికి అయ్‌పాయనే బతుకు? తక్కువ జాతోడని నువ్వు గూడా నన్ను తక్కువ చూపు చూసినట్టుండాదే? లేకపోతే ఇట్టా ఎందుకవుతుంది అయ్యోరా?" నోటికి వచ్చినట్లు వాగుతూ, పడ్తు లేస్తూ, నవ్వుతూ ఏడుస్తూ ,ఏడుస్తూ నవ్వుతూ, ఏడవలేక నవ్వలేక పండ్లు పటపట కొరుకుతూ ముత్యాలు చెట్టుకిందికి చేరాడు.

"ఇరవైఒకటో శతాబ్దం ఆరంభంలోనే మానవుడు చంద్రమండలం మీద స్థావరం ఏర్పరుచుకోవడానికి వీలు ఉంది. ఈ అణుకేంద్రంలో శాస్త్రజ్ఞులు అది సాధించడానికే అహోరాత్రాలు కృషిచేస్తున్నారని అణుశాస్త్ర కేంద్ర అధికారి నిన్న జరిగిన విలేకరుల గోష్ఠిలో తన విశ్వాసాన్ని స్పష్టంగా వెలిబుచ్చారు."

అంతకు ముందే చెట్టుకిందకు చేరిన ముత్యాలు కొడుకులు రేడియో పెట్టుకుంటే వార్తలు వినిపిస్తున్నాయి. ఎగిరి ఒకే ఒక్క తన్ను తన్నాడు ముత్యాలు. బంతిలా ఎగిరి చెట్టుబోదెకు తగిలి, బుల్లి రేడియో ముక్కలు ముక్కలైంది.

ఆ శబ్దంతో ఎగిరిపడి లేచింది ముత్తమ్మ.

ముక్కలు ముక్కలైన బుల్లి రేడియోలా ముత్యాలు ఆ చెట్టుకింద కుప్పగా కూలి పోయాడు. అది కంటపడేసరికి ఆమె గుండె చెరువయింది. చివ్వలా పైకి లేచింది.

వెళ్లి అతని పక్కన కూర్చొనింది. వాలిపోయిన తలను ఎత్తి తొడమీద పెట్టుకొనింది.

ముత్యాలు ముత్తమ్మ మొగంలోకి వెర్రిగా చూస్తున్నాడు!

"మాఁవా! మనం రెక్కలు ముక్కలు చేసుకోని చెమటోడ్చి కట్టుకుణ్ణె గుడిసెను పెరుకుణ్ణారేకానీ, మన చెమటను పెరుక్కుండేదానికి ఏ యదవ తరమవితింది మాఁవా? ఇన్నేండ్లుగా కడుపులో పెట్టుకోని కాపాడిన చెట్టునీడ ఉండనే ఉండాది. దీని కెందుకు మాఁవా ఇంత యాదన పడ్తా ఉండావే?"

ముత్తమ్మ సముదాయించే ప్రయత్నం చేసింది.

"ఒసే పిచ్చిమొకమా! హ్హా హ్హా హ్హా!యాదనా? ఎందుకే? యాదనాలే, ఇచారమూలే. ఇప్పుడు ఏమైపోయిందని ఇచారపడాల? హుఁ! ఇదిగాకుండా బోతే దీనబ్బట్టాంటిది యాడ?... అడ!... ఊఁ! చంద్రమండలం మింద!... ఇయ్యరవదాకా రేడియోలో చెప్పినారే! ఇన్లేదంటే నిద్దర మొకమా? ఇంకమిందటా, అఁ!మణుసులు చంద్రమండలం మింద గూడా.... ఇండ్లేసు కోవచ్చుంట! హ్హె హ్హె హ్హె!... అందుకేనే పోతా ఉండా అందురి కంటే ముందుగా. ఈడెట్టా ఎనకబడిపాయ్ ఏడస్తా ఉండాం. అడ్కైనా ముందుముందుగా పోతే, గుడిసిల్లా? ఎందుకే ఏకంగా మిద్దిల్లు కట్టుకుండేదానికే. జాగా, యాడ? అడ! చంద్రమండలం మింద!...'

ఎక్కిళ్ల మీద ఎక్కిళ్లు ఎడతెరపిలేకుండా వస్తున్నాయి. ముత్తమ్మ తలమీద తట్టింది. గొంతుమీద రుద్దింది. ఎదమీద నిమిరింది. ముంతతో నీళ్లు తాగించే ప్రయత్నం చేసింది. ఎంత ప్రయత్నించినా గొంతులోకి పోలేని నీళ్లు దవడలమీద జారిపోతున్నాయి. 'మాఁవా! మాఁవా!' అని పిలుస్తూనే ఉంది. అంతలోనే తేలగుడ్లు పడ్డాయి. పండ్లు గిట్టుకున్నాయి. ముత్యాలు తల ముత్తమ్మ తొడమీద వాలిపోయింది.

ముత్యాలు గుండెలపై ముత్తమ్మ. చుట్టూ కొడుకులు. ఆ చెట్టుకింద కాకి శోకం.

పోలీస్ స్టేషన్‌లో సారా కాంట్రాక్టర్ మూర్తి కృతజ్ఞతాభావం డబ్బుగా మారి ఇన్‌స్పెక్టర్ జేబులో చేరి చేతులు మారితే గుడిసెలే కాదు, గుండెలు తీసే శక్తి తనకుందని విర్రవీగుతూ ఉంది.

పాలపుంత మీద ఒక ధూళి రేణువు ఫక్కుమని నవ్వింది●

-ఇండియాటుడే (21-9-1999)